క్లుప్తంగా

ఘనంగా ప్రదోష కాల పూజ



కాశీవిశ్వేశ్వరునికి అభిషేకం చేస్తున్న అర్చకులు

ప్రొద్దుటూరు : స్థానిక వైఎంఆర్ కాలనీ దత్తపీఠంలో త్రయోదశి సందర్భంగా బుధవారం రాత్రి కాశీవిశ్వేశ్వరస్వామికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి మూల విరాట్‌కు రుద్రాభిషేకం, నందీశ్వరునికి విశేష అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి హుండీ ఆదాయం లెక్కించారు. స్వామివారికి మూడు నెలల 15 రోజులకు గాను భక్తులు రూ.1,34,924 కానుకల రూపంలో సమర్పించారు. కార్యక్రమంలో రాజంపేట దేవాదాయ ఇన్‌స్పెక్టర్ సి.శివయ్య, ఈఓ రమణారెడ్డి, ఆలయ చైర్మన్ ఎస్.సత్యనారాయణ, మెంబర్ కిశోర్, అటెండర్ రాజు, అర్చకులు మధుసూదనాచార్యులు, వంశీ, భక్తులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికతీత



పూడికతీత పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి

ప్రొద్దుటూరు : పట్టణంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రధాన కాలువల్లో పూడికతీత పనులు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. బుధవారం సినీహబ్ వద్ద కొత్తపల్లె కాలువలో పూడికతీత పనులను మున్సిపల్ కమిషనర్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు కాలువలను శుభ్రం చేసి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గోవిందరెడ్డి, సుబ్బరాయుడు, నూర్‌బాషా పాల్గొన్నారు.

అన్నదానం



వృద్ధాశ్రమంలో భోజనం వడ్డిస్తున్న శూలం లక్ష్మీదేవి

ప్రొద్దుటూరు : స్థానిక మదర్ థెరిసా వృద్ధాశ్రమంలో బుధవారం వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి మాట్లాడుతూ ముదిరెడ్డి మల్లారెడ్డి జ్ఞాపకార్థం వృద్ధాశ్రమంలో అన్నదానం, ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన వెంకటరమణమ్మకు కుట్టుమిషన్ పంపిణీ చేసినట్లు తెలిపారు.

కంపచెట్లు తొలగింపు



కంపచెట్లు తొలగిస్తున్న సర్పంచ్ సుధాకర్

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల పంచాయతీ పరిధిలోని రామాయపల్లెకు వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరిగిపోయాయి. వర్షాలకు కంపచెట్లు అధికంగా పెరగడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంపచెట్లను తొలగించాలని రామాయపల్లెవాసులు స్థానిక సర్పంచ్ యనమల సుధాకర్‌ను కోరారు. స్పందించిన సర్పంచ్ కంపచెట్లును తొలగించారు. దీంతో రామాయపల్లె ప్రజలు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఖాదర్‌పల్లెలో వైద్య శిబిరం

చాపాడు : మండల పరిధిలోని ఖాదర్‌పల్లె గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డా.శ్రీవాణి తెలిపారు. గ్రామంలోని ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి అవసరమైన మందులను పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

బాబుగారి భరోసా ఎప్పుడో!

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా క్రమం తప్పకుండా వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందజేశారు. అర్హత ఉన్న ప్రతి రైతుకు సాయం అందిస్తూ సాగును పండుగలా మార్చారు. ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల్లో రైతు భరోసా ఒకటి. ఖరీఫ్ సీజన్ మొదలైనా బాబుగారి భరోసా రైతుల దరిచేరలేదు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని త్వరగా అమలు చేస్తే సాగుకు సాయంగా ఉంటుందని అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు.



ఖరీఫ్ సాగు చేసేందుకు దుక్కి దున్నుతున్న రైతు

- రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ సొమ్ము
- రాష్ట్ర ప్రభుత్వ సాయం కోసం రైతుల ఎదురుచూపులు
- పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ.20 వేలు హామీ
- చంద్రబాబు సూపర్ సిక్స్‌లో రైతు భరోసా ఒకటి

కాశినాయన : పుడమిపుత్రులు పొలాల బాట పట్టేందుకు సన్నద్ధమయ్యారు. ఒకపక్క అతివృష్టి మరోపక్క అనావృష్టి, చీడపీడలు, నకిలీ విత్తనాలు రైతులను నట్టేట ముంచుతున్నాయి. పది రోజుల క్రితం పదును వాన కురవడంతో నియోజకవర్గంలో ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. పచ్చని సిరులు పండించేందుకు ఏటా ప్రభుత్వం అందించే సాయం కోసం రైతులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పంట సాగు ఆర్థిక సాయం ఎప్పుడు వస్తుందా అనే అయోమయంలో పడ్డారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి నగదు రైతుల ఖాతాల్లో జమ అయింది. కొత్తగా పగ్గాలు చేపట్టిన టీడీపీ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన రైతుల ఆర్థిక సాయంపై ఇంకా అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. ఖరీఫ్ సాగు ప్రారంభించిన రైతులు ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం త్వరగా వస్తే సాగుకు వెసులుబాటుగా ఉంటుందని ఆశగా చూస్తున్నారు.

కొత్త ప్రభుత్వానికి రైతుల విన్నపం

గత ప్రభుత్వం వైఎస్సార్ రైతుభరోసా, పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి కలిపి రైతులకు ఏటా రూ.13,500 మూడు దఫాలుగా అందించేది. దీని వలన ఖరీఫ్‌లో పంట పెట్టుబడికి వెసులుబాటు ఉండేది. తొలి విడతగా మే నెలలోనే రూ.7,500 రైతు ఖాతాల్లో జమ చేసేది. చిన్న, సన్నకారు, పేద రైతులకు ఖరీఫ్‌లో పెట్టుబడి చాలా వరకు కలిసి వచ్చేది. మే నెలతో పాటు అక్టోబర్, జనవరి నెలల్లో ఈ రెండు పథకాల నిధులు వారి ఖాతాల్లో పడేది. వైఎస్సార్ రైతుభరోసా తొలి విడతగా రూ.5,500, రెండవ విడత అక్టోబర్ నెలలో రూ.2 వేలు చొప్పున అందించేవారు. కేంద్రం పీఎం కిసాన్ నిధిగా రూ.6 వేలు, మూడు విడతలుగా రూ.2 వేలు చొప్పున ఇచ్చేవారు. ఈ ఏడాది మే నెలలో సార్వత్రిక ఎన్నికల కారణంగా పీఎం కిసాన్ నిధి ఆలస్యంగా జూన్ నెలలో వేశారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా రైతులకు రూ.20 వేలకు సంబంధించి ఇప్పటి వరకు జీఓ విడుదల కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తమ ఖాతాల్లో పెట్టుబడి సాయం అందించాలని రైతులు కోరుతున్నారు. కొత్త ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను త్వరగా అమలు చేస్తే సకాలంలో పంటలను సాగు చేసుకుంటామని రైతులు కోరుతున్నారు.

తిరుచ్చి వాహనంపై శ్రీనివాసుడు



లక్ష్మీహయగ్రీవ హోమం నిర్వహిస్తున్న వేదపండితులు



తిరుచ్చి వాహనంపై శ్రీవారిని ఊరేగిస్తున్న భక్తులు

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటం రోడ్డులోని శ్రీమహాలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ నవమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారిని తిరుచ్చి వాహనంపై ఊరేగించారు. దారి పొడవునా భక్తులు స్వామివారికి నీరు వారపోసి కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఉదయం నుంచి ఆలయంలో లక్ష్మీహయగ్రీవ హోమము, వేదస్వస్తి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు వల్లంకొండు వెంకటరమణ, ధనలక్ష్మి, సభ్యులు అనీత్, అంకయ్య, నాగేంద్రకుమార్, గురివిరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు వీరేశాచార్యులు పాల్గొన్నారు.

నైతిక విలువలతోనే మెరుగైన సమాజం



పుస్తకాలను అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

ప్రొద్దుటూరు కల్చరల్ : నైతిక విలువలు పెంపొందించుకోవడంతోనే మెరుగైన సమాజ నిర్మాణం సాధ్యమని వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పి.రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక నడింపల్లె మున్సిపల్ హైస్కూల్‌లో బుధవారం వివేకానందుని బోధనలపై చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు నైతిక విలువలు అలవర్చుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు పోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వివేకానందుని "విజయానికి మార్గం" అనే పుస్తకాన్ని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అల్తాఫ్ అహ్మద్, ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, వెంకట సురేష్, విజయ్, ఉపాధ్యాయులు పద్మావతి, గంగాదేవి, జ్యోతి, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

కారుణ్య నియామకాల్లో కాఠిన్యం



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి

కలసపాడు : కుటుంబ పెద్దదిక్కును కోల్పోయి కారుణ్య నియామకాల కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్న ఉద్యోగుల కుటుంబ సభ్యులపై కనికరం చూపాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం కలసపాడులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఎస్టీయూ మండల శాఖ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు, కరోనా, అనారోగ్యం తదితర కారణాలతో చనిపోయిన ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆధారిత కుటుంబ సభ్యులకు వారి విద్యార్హతలను బట్టి జూనియర్ అసిస్టెంట్ కేడర్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు ఇవ్వడం జరుగుతుందన్నారు. కానీ కడప జిల్లాలో కారుణ్య నియామకానికి దరఖాస్తు చేసుకున్న సుమారు 75 మందిలో చాలా మందికి అర్హతలు ఉన్నప్పటికీ జీఓ నంబర్ 1,473ను అమలు చేయకుండా మెమో నంబర్ 35,252ను సాకు చూపుతున్నారని తెలిపారు. స్థానిక సంస్థలలో జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీ లేవనే కారణం చూపి బలవంతంగా అందరికి అటెండర్ పోస్టులు ఇచ్చి ఉత్తర్వులను పోస్టు ద్వారా అభ్యర్థుల ఇళ్లకు పంపించారన్నారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో 35,252 రద్దు కోసం పోరాడతామని తెలిపారు. సమావేశంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శేఖర్ బాబు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్.వి.సత్యనారాయణ, జిల్లా కమిటీ కన్వీనర్ కె.వి.సత్యనారాయణ, శివారెడ్డి, మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, బి.ఎస్.వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన తప్పనిసరి



ప్రొద్దుటూరు : మాట్లాడుతున్న జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రోగ్రాం ఆఫీసర్ జి.సునీత



మైదుకూరు : మాట్లాడుతున్న సీడీపీఓ శ్రీదేవి



చాపాడు: మాట్లాడుతున్న సీడీపీఓ సావిత్రమ్మ

చాపాడు : భారతీయ నూతన చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సావిత్రమ్మ అన్నారు. స్థానిక స్త్రీ శక్తి భవనం వద్ద బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన అన్ని రకాలైన చట్టాలపై అంగన్‌వాడీ వర్కర్లు అవగాహన కలిగి ఉండాలన్నారు. న్యాయవాది మాధవి లత నూతన చట్టాలను వివరించారు. నాగరిక సురక్ష సంహిత-2023, గృహ హింస చట్టం వంటి మహిళలకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. వెలుగు ఏపీఎం వెంకటరమణ మాట్లాడుతూ నూతన చట్టాలపై అవగాహన కల్పించుకోవటం ద్వారా మహిళలు నిర్భయంగా ప్రభుత్వ యంత్రాంగం ద్వారా రక్షణ పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ, ఉపాధి హామీ పథకం ఏపీఓ జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

మైదుకూరు : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి, కడప వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.అశ్విని తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో బుధవారం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త భారతీయ చట్టాలపై అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయాల మహిళా సంరక్షణ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వరలక్ష్మి, ఓబుళమ్మ, శ్రీదేవి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : కొత్త చట్టాలపై ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రోగ్రాం ఆఫీసర్ జి.సునీత తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కొత్త చట్టాలపై ఐసీడీఎస్ అధికారులకు, గ్రామ, వార్డు సచివాలయాల మహిళా పోలీసులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024 జూలై 1 నుంచి మూడు కొత్త చట్టాలు అమలులోకి వచ్చాయన్నారు. ఇండియన్ పీనల్ కోడ్‌ను భారతీయ న్యాయ సంహిత చట్టంగా, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌ను భారతీయ న్యాయ సురక్ష సంహిత చట్టంగా, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌ను భారతీయ సాక్ష్య అభినయ చట్టంగా రూపొందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రూరల్ సీడీపీఓ అరుణకుమారి, సీనియర్ న్యాయవాది ముడిమెల కొండారెడ్డి, సూపర్ వైజర్లు కళావతి, ఈశ్వరి, విజయేశ్వరి, గౌసియా, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలపై ధర్నా



ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

పోరుమామిళ్ల : పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే రిలే నిరాహార దీక్షలు ప్రారంభిస్తామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిడుగు మస్తాన్, సీపీఐ మండల కార్యదర్శి రవికుమార్ పేర్కొన్నారు.

పోరుమామిళ్ల, రంగసముద్రం పంచాయతీల కార్మికులతో కలసి బుధవారం మండల కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాతపద్ధతిలోనే టెండర్లు నిర్వహించి పంచాయతీ కార్మికులను తీసుకోవాలన్నారు. పోరుమామిళ్ల, రంగసముద్రం పంచాయతీల్లో 15 సంవత్సరాలకు పైగా కార్మికులుగా కొనసాగుతున్నారని, ఇప్పుడు దళారుల తాకిడి అధికమయిందన్నారు. వారు ఒన్‌సైడ్ టెండర్‌తో పాత కార్మికులను రోడ్డు పాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. ధర్నాలో ఏఐటీయూసీ మండల అధ్యక్ష, కార్యదర్శులు సఫా, పీరయ్య, కార్మిక నాయకులు నాగేష్, తిరుపాలు, కొండయ్య, శ్రీరాములు, ఓబులమ్మ, చిన్నక్క తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వస్తువులు సీజ్



స్వాధీనం చేసుకున్న సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను చూపుతున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి

ప్రొద్దుటూరు : మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి బుధవారం టూటౌన్ బైపాస్ రోడ్డులోని నాయుడు ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో ఉన్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సామాగ్రిని సీజ్ చేశారు. పట్టణంలోని స్వస్తిక్ ఏజెన్సీ వ్యాపారి ఈ సరుకును తెప్పించుకున్నట్లు అధికారులు తెలిపారు. సుమారు 200 కిలోల ప్లాస్టిక్ కవర్లతో పాటు వంద ప్యాకెట్లు గ్లాసులను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ స్వాధీనం చేసుకున్న వస్తువులను ప్రదర్శించారు. కార్యక్రమంలో కమిషనర్‌తో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గోవిందరెడ్డి, నూర్ బాషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేత



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

పోరుమామిళ్ల : సంవర్ధిని అఖిల భారత ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం బుడగ జంగాల పిల్లలకు విద్యా సామగ్రి అందజేశారు. టస్ట్ కార్యకర్తలు గంటా గురులక్ష్మి, ఉమాదేవి మాట్లాడుతూ మిట్టా లక్ష్మీపద్మ ఆర్థిక సహకారంతో పట్టణంలోని బుడగ జంగాల కాలనీకి చెందిన పేద విద్యార్థులకు ఈ సహాయం అందించామన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణ, పరిశుభ్రత, నైతిక విలువలు నేర్పించుటకు ఒక ట్యూటర్‌ను నియమించామని తెలిపారు. అలాగే విద్యార్థులకు గుణాత్మక విద్యను, నైపుణ్యాన్ని అందించేందుకు 'బాల సంస్కార కేంద్రాన్ని' ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యకర్తలు గురులక్ష్మి, ఉమాదేవితో పాటు లక్ష్మీపద్మ, భాగ్యలక్ష్మి, రమణకుమారి, సుమలత, చెన్నయ్య, రామకృష్ణారెడ్డి, చెన్నకృష్ణయ్య, రమణయ్య, శ్రీనివాసరెడ్డి, గురుమూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులను ఇబ్బంది పెడితే చర్యలు



కస్తూర్బా పాఠశాలలో నీటి ట్యాంకును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా

మైదుకూరు : ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడినా నిర్వాహకులపై చర్యలు తప్పవని మైదుకూరు పురపాలక కమిషనర్ జబ్బార్ మియా హెచ్చరించారు.

కలెక్టర్ ఆదేశాలతో ఆయన బుధవారం పురపాలక సంఘం పరిధిలోని బీసీ, ఎస్సీ సంక్షేమం హస్టళ్లు, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేశారు. ఆయా చోట్ల వంట ఏజెన్సీలను తనిఖీ చేసి అక్కడి సదుపాయాల గురించి ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడారు. హస్టళ్లలో, కస్తూర్బా పాఠశాలలోని నీటి ట్యాంకులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని వంట ఏజెన్సీలకు, హెడ్మాస్టర్లకు కమిషనర్ సూచించారు. వసతులు, భోజనం, తాగునీటి విషయంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. కమిషనర్ వెంట మున్సిపల్ అధికారి సుబ్బరాయుడు ఉన్నారు.


రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి



శివాలయం సెంటర్‌లో నిరసన తెలుపుతున్న బీజేపీ, వీహెచ్‌పీ, శివశక్తి సంఘం నాయకులు

ప్రొద్దుటూరు : లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హిందూ సమాజాన్ని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేశారని ఆయన క్షమాపణ చెప్పాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గొర్రె శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక శివాలయం సెంటర్‌లో బీజేపీ, విశ్వహిందూ పరిషత్, శివశక్తి హిందూ సంఘం నాయకులు రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గొర్రె శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు వంకదారి నరేంద్రరావు మాట్లాడుతూ పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే సమావేశంలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ హిందువులను కించపరిచే వ్యాఖ్యలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భూమిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శులు పరమేశ్వరరావు, చలపతిరావు, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు చీతిరాల నాగార్జున, రాయలసీమ ఇన్‌చార్జి మారెళ్ల మల్లికార్జునరావు, పట్టణాధ్యక్షుడు నాగమణిరెడ్డి, శివశక్తి హిందూ సంఘం అధ్యక్షుడు పుల్లారెడ్డి పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



నీటి కుంటల్లో చేపలు వదులుతున్న వైద్య సిబ్బంది

బద్వేలు అర్బన్ : బద్వేలు మండల, మున్సిపాలిటీ పరిధిలో దోమల నివారణ చర్యల్లో భాగంగా బుధవారం మంచినీటి కుంటల్లో గంబూసియా చేపలు వదిలారు.

ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జె.వినయ్‌కుమార్ మాట్లాడుతూ మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధులకు మూలకారణమైన దోమలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ దోమల నివారణ చర్యలు పాటించాలని కోరారు. గంబూసియా చేపల ద్వారా మంచినీటి కుంటల్లో పెరిగే దోమల లార్వాలను నశింపజేయవచ్చని అన్నారు. ప్రజలు కూడా బాధ్యతగా వారంలో ఒక రోజు డ్రైడే పాటించడంతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. తప్పనిసరిగా దోమతెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి బ్రహ్మాజీ, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ జనార్దన్‌రావు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



మృతుని భార్య రమణమ్మకు ఆర్థిక సాయం అందజేస్తున్న కువైట్ యాదవ సంఘం నాయకులు

అట్లూరు : ఇటీవల కువైట్‌లో గుండెపోటుతో మృతి చెందిన ఈటి అయ్యవారయ్య కుటుంబానికి కువైట్ యాదవ సంఘం రూ.లక్ష ఆర్థిక సాయం అందజేసింది. మండలంలోని కామసముద్రం గ్రామానికి చెందిన ఈటి అయ్యవారయ్య కువైట్‌కు వలస వెళ్లాడు. ఇటీవల కువైట్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. మృతునికి భార్య రమణమ్మతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబం పెద్ద దిక్కును కోల్పోవడంతో కువైట్ యాదవ సంఘం అధ్యక్షుడు చల్లాబాబుయాదవ్, అట్లూరు మండల అధ్యక్షుడు ఆవులపోలు మునెయ్యయాదవ్ దృష్టికి తీసుకెళ్ళడంతో కువైట్ యాదవ సంఘం ఆధ్వర్యంలో రూ.లక్ష పంపించారు. ఈ సాయాన్ని బద్వేలు యాదవ సంఘం అధ్యక్షుడు బుర్రిరాజా యాదవ్, ఆవులపోలు రమణయ్యయాదవ్, పగిడి పెద్దయల్లయ్య మృతుని భార్య రమణమ్మకు అందజేశారు. దీంతో కువైట్ యాదవ సంఘానికి ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల సత్తా



పథకాలు సాధించిన విద్యార్థినులు మహిథ, ధాత్రిన్

ప్రొద్దుటూరు : విశాఖపట్నంలో జూన్ 29, 30, జూలై 1న జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో స్థానిక విన్ తైక్వాండో అకాడమి విద్యార్థులు ప్రతిభ చూపి పతకాలు సాధించినట్లు కోచ్‌లు కమల్, సంతోష్ తెలిపారు. మహిత, ధాత్రిన్ తైక్వాండో పోటీల్లో ప్రతిభ చూపి రెండు రజత పతకాలు సాధించారని తెలిపారు. వీరిని కోచ్‌లతోపాటు ఏపీఎస్‌పీడీసీఎల్ బీసీ సంఘం అధ్యక్షుడు మురళిమోహన్, తల్లిదండ్రులు అభినందించారు.

నేడు భూముల వేలం

రాజుపాళెం : మండలంలోని పగిడాల గ్రామంలోని శ్రీచెన్నకేశవ, ఈశ్వర, రామాంజనేయ దేవస్థానాలకు సంబంధించిన భూములను గురువారం వేలం వేయనున్నట్లు ఆలయ ఈఓ కె.రామచంద్రాచార్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాట ప్రొద్దుటూరులోని నారాయణ రంగయ్యగారి సత్రంలో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని, భూములు దక్కించుకున్న పాటదారులు ముందస్తుగా కౌలు చెల్లించి మూడేళ్లు పంటలు పండించుకోవచ్చునని తెలిపారు.

6న జాబ్‌మేళా

కడప ఎడ్యుకేషన్ : కడపలో గల స్పిరిట్ డిగ్రీ అండ్ పీజీ(ఎంబీఏ అండ్ ఎంసీఏ)కళాశాలలో ఈనెల 6వ తేదీ ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి ఎస్ఎండీ మునీర్ తెలిపారు. ఈ మేళాను హైదరాబాదుకు చెందిన ఎం/ఎస్ కేడర్ కెరియర్స్ సంస్థ తరపున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9885250955 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.